క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 7న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని కల్లు మండువా, ఎఫ్‌సీఐ కాలనీ, అరుణోదయ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, కృష్ణాకాలనీ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సత్తయ్యకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని తెలుగు విభాగం పరిశోధకుడు సాగర్ల సత్తయ్యకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. దోరవేటి సమగ్ర సాహిత్యం – ఒక అధ్యయనం అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సాగర్ల సత్తయ్యకు డాక్టరేట్ ప్రకటించినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఆ విభాగం ప్రొఫెసర్ శ్రీదేవి పర్యవేక్షణలో సత్తయ్య తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

8న వివాహ పరిచయ వేదిక

న్యూశాయంపేట: మైనారిటీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 8న మెగా దూ – బ – దూ ములాఖత్ (ఉచిత వివాహ పరిచయ వేదిక) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కన్వీనర్ డాక్టర్ అనీస్ సిద్దిఖీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ ములుగురోడ్డులోని ముస్లిం కమ్యూనిటీ సెంటర్‌లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఉంటుందని వివరించారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ముస్లిం యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 99087 63454, 98490 12987 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలిగా కవిత



హన్మకొండ: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా 9వ డివిజన్ న్యూరాయపురకు చెందిన కత్తుల కవిత నియమితులయ్యారు. ఈమేరకు ఆమెకు రెడ్డికాలనీలోని సంఘం జిల్లా కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యాంయాదవ్ నియామక ఉత్తర్వులను శుక్రవారం అందజేశారు.

ఉద్యమకారులకు అవమానం

హన్మకొండ: ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాడి, కేసులు పాలై కోర్టుల చుట్టూ తిరిగి, పోలీసుల దెబ్బలకు గురైన ఉద్యమకారులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌ను కలిసే అవకాశం కల్పించకపోవడంతో వారు అవమానంగా భావించారు. హనుమకొండ బాలసముద్రంలో మధ్యాహ్న భోజనం చేసి విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో మంత్రి కేటీఆర్‌ను కలిసేందుకు కాకతీయ విశ్వవిద్యాలయం విద్యార్థి జేఏసీ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ప్రయత్నించారు. పోలీసులు అనుమతించకపోవడంతో పాటు, పార్టీ నాయకుల నుంచి సహకారం లభించకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. ఉద్యమంలో పాల్గొనని నాయకులకు ఉన్న ప్రాధాన్యం తమకు లేదని వారు అసహనానికి గురయ్యారు. ఉద్యమకారులను గుర్తించాలని కోరారు. కాగా, మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పించిన ఇంటిలోకి ముందుగా తయారు చేసిన జాబితాలో పేర్లు ఉన్న వారిని మాత్రమే పోలీసులు అనుమతించారు.

గెత్సమనే ప్రార్థన మందిరం వార్షికోత్సవం



మడికొండ: కాజీపేట మండలం రాంపూర్ గ్రామంలోని గెత్సమనే ప్రార్థన మందిరం ఆరవ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా క్రిస్టియన్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సభ్యులకు పంచి పెట్టారు. పాస్టర్లను సంఘ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిరం బ్రదర్ జోసఫ్, పాస్టర్ ఆరోగ్యరాజ్, డాక్టర్ సత్యం, సంఘ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎక్కి హల్‌చల్

ఖిలా వరంగల్: ఓ యువకుడు సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. తన భూమిని బీఆర్ఎస్ నాయకులు కబ్జా చేశారని ఆరోపిస్తూ శుక్రవారం మధ్యాహ్నం 37వ డివిజన్ తూర్పుకోటకు చెందిన కనుకుంట్ల తిలక్‌తేజ.. సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యకు యత్నించాడు. తన భూమిని తిరిగి తనకు ఇప్పించాలని వేడుకున్నాడు. సమస్యను పరిష్కరిస్తామని పోలీసులు హామీ ఇచ్చారు. అనంతరం, బాధితుడు తిలక్‌తేజ సెల్ టవర్ దిగగానే అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

నాయకుల అరెస్ట్.. విడుదల



మడికొండ పోలీస్ స్టేషన్‌లో నాయకులు



వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో..



కాజీపేట పోలీస్ స్టేషన్‌లో..

మడికొండ: నగరంలో మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా పలువురు నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి అనంతరం విడుదల చేశారు. మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలోని కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టైన వారిలో వస్కుల శంకర్, బైరి లింగమూర్తి, పల్లపు మల్లికార్జున్, వస్కుల ప్రవీణ్, ముత్తోజు సురేష్, గడ్డం మహేందర్ ఉన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు

కాశిబుగ్గ: మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా కాంగ్రెస్ మైనార్టీ నాయకులను హౌస్ అరెస్టులు, ముందస్తుగా అరెస్ట్ చేయడం సరికాదని పార్టీ నేత మహమ్మద్ అయూబ్ అన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో నగరానికి ఏమి చేశారో కేటీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు.



కాశిబుగ్గ: హౌస్ అరెస్ట్‌లో అయూబ్

బీజేపీ నాయకుల అరెస్ట్

ఖిలా వరంగల్: మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా బీజేపీ నాయకులను మిల్స్‌కాలనీ పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై శుక్రవారం సాయంత్రం విడుదల చేశారు. కేటీఆర్ పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలో భాగంగా బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకొని వదిలేసినట్లు ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు.

కాజీపేటలో..

కాజీపేట: నగరంలో శుక్రవారం మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా కాజీపేట పట్టణంలోని పలువురు బీఆర్ఎస్‌యేతర పార్టీల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మంత్రి పర్యటన నేపథ్యంలో తమను అకారణంగా అరెస్ట్ చేయడం బాధాకరమని వాపోయారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన నాయకులు





మంత్రి కేటీఆర్‌తో సంఘం నాయకులు, సంపత్‌కుమార్



హసన్‌పర్తి: మంత్రిని కలిసిన నాయకులు

హన్మకొండ అర్బన్: నగరానికి విచ్చేసిన రాష్ట్ర మంత్రి కేటీఆర్‌ను తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సంఘం నాయకులు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, రాష్ట్ర సలహాదారులు రావుల నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

న్యూశాయంపేట: రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలని వరంగల్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట సంపత్‌కుమార్ కోరారు. ఈమేరకు మంత్రి కేటీఆర్‌ను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందించారు. సీఎంఆర్ పేమెంట్స్, 2022 –23 ఖరీఫ్ సీజన్, సీఎంఆర్ బియ్యం, సివిల్ సప్లైస్ రా రైస్ టార్గెట్, బాయిల్డ్ రైస్ టార్గెట్లు, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు.

హసన్‌పర్తి: మంత్రిని మార్కెట్ కమిటీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ యూత్ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్రీకాంత్, నాయకుడు కందుకూరి సాయిచంద్ మడికొండలో శుక్రవారం కలిశారు.

రేపు ఎంఆర్ఐ సేవలు ప్రారంభం

ఎంజీఎం : ఎంజీఎంలో రూ.11 కోట్లతో అందుబాటులోకి తెచ్చిన ఎంఆర్ఐ పరికరాన్ని శుక్రవారం మంత్రి కేటీఆర్ ప్రారంభించాల్సి ఉండగా వాయిదా పడింది. శనివారం మంత్రులు దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్‌ల చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తెలిపారు.

'డబుల్' ప్రారంభోత్సవం రద్దు

శుక్రవారం దూపకుంటలోని డబుల్ బెడ్రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవం రద్దయింది. కేటీఆర్ బిజీగా ఉండడంతో కార్యక్రమం రద్దయినట్లు అధికారులు తెలిపారు. కాగా.. మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య సుమారు గంటపాటు మంత్రి కేటీఆర్ కోసం వేచి చూసి వెళ్లిపోయారు.

సెల్ టవర్ నిర్మించొద్దని గ్రామస్తుల ఆందోళన



ఆందోళన చేస్తున్న స్థానికులు

మడికొండ: 64వ డివిజన్ మడికొండలో ఒక ప్రైవేట్ స్థలంలో సెల్ టవర్ నిర్మాణం కోసం గుంతలు తీయగా స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ సెల్ టవర్ నిర్మాణంతో రేడియేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈక్రమంలో సెల్ టవర్ నిర్మిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు.

మంత్రి కేటీఆర్ సభకు తరలిన జనం



నయీంనగర్: స్కూల్ బస్సుల్లో తరలివచ్చిన జనం



బస్సులను ప్రారంభిస్తున్న నర్సింగరావు

నయీంనగర్: శుక్రవారం జరిగిన మంత్రి కేటీఆర్ సభకు నగరంలోని పలు డివిజన్ల కార్పొరేటర్లు తమ డివిజన్ల నుంచి ప్రజలను డప్పు చప్పుళ్లు, డీజే సౌండ్‌ల మధ్య కాలినడకన, వాహనాల్లో, బైక్ ర్యాలీ ద్వారా తరలించారు. దాంతో బాలసముద్రం కుడా మైదానానికి వెళ్లే రోడ్లన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. సభా ప్రాంగణం నిండిపోయింది. ట్రాఫిక్‌కు కొంతసేపు అంతరాయం కలిగింది.

కాజీపేట రూరల్: మంత్రి కేటీఆర్ బహిరంగ సభకు కాజీపేట బాపూజీనగర్ నుంచి పలువురు నాయకులు శుక్రవారం తరలివెళ్లారు. 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగరావు.. జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు దువ్వ కనకరాజు, నార్లగిరి రమేష్, గబ్బెట శ్రీనివాస్, మర్యాల కృష్ణ, దశరథం, నయీంజుబేర్, మైలారం శంకర్, బొట్టు రాజు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కేటాయింపు సర్క్యులర్ కాపీ అందజేత

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ పరిధిలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు సర్క్యులర్ కాపీని మంత్రి కేటీఆర్ శుక్రవారం సిక్స్ మెన్ కమిటీ సభ్యులకు అందజేశారు. హౌసింగ్ సొసైటీల్లో సభ్యత్వం లేని నగర పరిధిలో అర్హత గల జర్నలిస్టులకు సొంతింటి స్థలం అందించేందుకు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, వివిధ జర్నలిస్టుల యూనియన్ల నేతల భాగస్వామ్యంతో ఏర్పడిన సిక్స్ మెన్ కమిటీ పనిని మంత్రి కేటీఆర్ అభినందించారు. అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలు అందించేందుకు దృఢ సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి కేటీఆర్ తెలిపారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం హసన్‌పర్తి మండలం మడిపల్లిలో కేటాయించిన 13ఎకరాల స్థలానికి సంబంధించి సర్క్యులర్ కాపీని సిక్స్ మెన్ కమిటీ సభ్యులకు మంత్రి అందజేశారు. కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, సిక్స్ మెన్ కమిటీ కన్వీనర్ బీఆర్.లెనిన్, కోకన్వీనర్ బొక్క దయాసాగర్, సభ్యులు గడ్డం రాజిరెడ్డి, మస్కపురి సుధాకర్, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్, హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీ తదితరులు పాల్గొన్నారు.



సర్క్యులర్‌ను అందజేస్తున్న మంత్రి కేటీఆర్

బ్రహ్మోత్సవాల కరపత్రం ఆవిష్కరణ

హన్మకొండ అర్బన్: నగర పర్యటనకు వచ్చిన మంత్రి కేటీఆర్ శుక్రవారం పద్మాక్షి నవరాత్రి ఉత్సవాల బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంత్రి సత్యవతి రాథోడ్, ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఆలయ పూజారి నాగిళ్ల శంకర్, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

తూర్పులో ఎగిరేది కాంగ్రెస్ జెండా

కాశిబుగ్గ: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఎగిరేది కాంగ్రెస్ పార్టీ జెండా అని కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ అన్నారు. ఎస్ఎస్ఐ జిల్లా అధ్యక్షుడు ఓని శ్రవణ్ ఆధ్వర్యంలో కాశిబుగ్గలో 50 మంది శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి అయూబ్ పార్టీలోకి ఆహ్వానించారు.

అసమర్థ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్

హన్మకొండ: ఇప్పటి వరకు ఒక్క డబుల్ బెడ్రూం ఇల్లు కూడా ఇవ్వని అసమర్థ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి విమర్శించారు. కేటీఆర్ జిల్లా పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులను హౌస్ అరెస్టు చేయడంపై నాయిని శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్బంధాలతో ప్రతిపక్షాల గొంతు నొక్కలేరని అన్నారు. బీఆర్ఎస్ నాయకుల మోసపూరిత మాటలను ప్రజలు నమ్మొద్దని నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు.

కిట్స్‌లో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

హసన్‌పర్తి: నగరంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు కొనసాగనున్న అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. 'కంప్యూటర్, కమ్యూనికేషన్ టెక్నాలజీ'పై నిర్వహించనున్న సదస్సులో ముఖ్యఅతిథిగా డీఆర్‌డీఏ శాస్త్రవేత్త ఆకుల నరేష్ పాల్గొని మాట్లాడారు. సదస్సుల్లో సుమారు 400లకు పైగా పరిశోధన పత్రాలు రిజిస్ట్రేషన్ కాగా, 70 పత్రాలు ఎంపికయ్యాయి. అనంతరం సావనీర్‌ను విడుదల చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వ్యాట్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ మాతిని, నిట్ ప్రొఫెసర్ డాక్టర్ కిశోర్‌కుమార్, డాక్టర్ సృజన్, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ రమాదేవి, ప్రొఫెసర్ రఘోత్తంరెడ్డి, డాక్టర్ రాముడు, డాక్టర్ ప్రభాకరాచారి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్ స్టేషన్‌కు సమీపంలో గత నెల 11న జరిగిన హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు. ఆ తెలిపిన వివరాల ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆవరణలో మద్యం మత్తులో హెంజల శివ అనే వ్యక్తిని రమేష్ అనే నిందితుడు హత్య చేసి, ఇంతకాలం పరారీలో ఉన్నాడు. పక్కా సమాచారంతో నిందితుడు రమేష్‌ను అరెస్టు చేసినట్లు సీఐ వివరించారు.

బీఆర్ఎస్‌లోకి ఈగ మల్లేశం

ఖిలా వరంగల్: సీనియర్ రాజకీయ నేత ఈగ మల్లేశం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా శుక్రవారం ఖిలా వరంగల్ వాకింగ్ గ్రౌండ్ ప్రాంగణంలో ఆయనకు మంత్రి కేటీఆర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఈగ మల్లేశం రాకతో పార్టీకి మరింత బలం పెరిగిందని, ఆయన సేవలను పార్టీ ఉపయోగించుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎంపీలు మాలోతు కవిత, వద్దిరాజు రవిచంద్ర, మేయర్ సుధారాణి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ సారయ్య, ఎమ్మెల్యే నరేందర్, కుడా చైర్మన్ సుందర్‌రాజు, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



మల్లేశంను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్

డీఎంహెచ్‌ను కలిసిన నాయకులు

హన్మకొండ అర్బన్: తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ మెడికల్ హెల్త్ జీ.శ్రీనివాస్‌రావును హనుమకొండ జిల్లా టీఎన్జీఓస్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో పలువురు నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. వివిధ జోన్లలో పనిచేస్తున్న అర్హత గల సీనియర్ అసిస్టెంట్లకు సూపరింటెండెంట్లుగా ప్రమోషన్లు కల్పించిన సందర్భంగా ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, కేంద్ర సంఘం నాయకులు శనిగరపు శ్యాంసుందర్, కిరణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస్‌రావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న టీఎన్జీఓస్ నాయకులు

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమేష్

హసన్‌పర్తి: అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. హసన్‌పర్తి మండలంలోని అన్నాసాగరం, మడిపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాలు శుక్రవారం జరిగాయి. అన్నాసాగరం నుంచి మడిపల్లి వరకు రూ.7.60కోట్ల వ్యయంతో నిర్మించిన రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే, అన్నాసాగరంలో రూ.30 లక్షల వ్యయంతో చేపట్టిన వివిధ కులాల కమ్యూనిటీ భవనాలు, రూ.10 లక్షల ఖర్చుతో మహిళా కమ్యూనిటీ భవనం, రూ.20 లక్షలతో గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాన చేశారు. మడిపల్లిలో రూ.1.25 కోట్ల వ్యయంతో నిర్మించిన బ్రిడ్జితో పాటు శ్మశాన వాటిక పనులను ప్రారంభించారు. అనంతరం బతుకమ్మ చీరలతో పాటు స్పోర్ట్స్ కిట్లను అందించారు. కార్యక్రమంలో అన్నాసాగం సర్పంచ్ అమితారెడ్డి, మడిపల్లి సర్పంచ్ సుమలత, ఎంపీపీ కేతపాక సునీత, జెడ్పీటీసీ సభ్యురాలు రేసుకుంట్ల సునీత, రైతు బంధు సమితి కోఆర్డినేటర్ అంచూరి విజయ్, వైస్ ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు ఇంద్రయ్య, జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుల సంక్షేమానికి కృషి



రమణకు బొకే అందజేస్తున్న నాయకులు

కాజీపేట రూరల్: సామాజిక, ఆర్థిక సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో కల్లు గీత కార్మికులు అభివృద్ధి సాధించేందుకు కల్లుగీత కార్మిక సంఘం నిరంతరం కృషి చేస్తోందని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ అన్నారు. కాజీపేట ఫాతిమానగర్ వైష్ణవి గ్రాండ్ హోటల్‌లో శుక్రవారం హనుమకొండ జిల్లా గీత కార్మిక సంఘం అధ్యక్షుడు గౌని సాంబయ్య అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎంవీ.రమణ మాట్లాడుతూ గీత కార్మిక సంఘం మొదటి రాష్ట్ర మహాసభ 1957, అక్టోబర్ 19, 20వ తేదీల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గార్లలో జరిగిందని గుర్తుచేశారు. 2023, అక్టోబర్ 19నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 66వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 19న అన్ని గ్రామాల్లో సంఘం జెండాల ఆవిష్కరణ, 20న హైదరాబాద్ సుందరయ్య కళా నిలయంలో రాష్ట్ర ఉత్సవాలు, 21 నుంచి 31 వరకు అన్ని జిల్లా కేంద్రాల్లో వార్షికోత్సవాలను నిర్వహించనున్నట్లు వివరించారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు బూడిద గోపి, తాళ్లపల్లి రామస్వామి, బుర్ర సుధాకర్, వల్లాల గంగాధర్, జిల్లా నాయకులు బుర్ర శ్రీనివాస్, జనగాని భిక్షపతి, మారగోని రాజు, కోతి సాంబరాజు, బొల్లికొండ యాదగిరి, రవీందర్, జనగాం సాయికుమార్, మాచర్ల రమేష్, సట్ల రమేష్, శేఖర్, బుర్ర సురేందర్, జనగాం లక్ష్మీనారాయణ, శతారి, చింతరాజు పాల్గొన్నారు.

మోటార్ వాహన చట్టాన్ని సవరించాలి

హన్మకొండ అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన మోటార్ వాహన చట్టం –2019ను సవరించాలని తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ – సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి గాదె ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించి, అనంతరం కలెక్టరేట్ ఏఓ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాపంగా కోట్లాది మంది కార్మికులు రవాణా రంగంపై ఆధారపడి తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని చెప్పారు. ఈ క్రమంలో రోజంతా కష్టపడి సంపాదించిన సొమ్ము పెనాల్టీలు, చార్జీలకే సరిపోతోందని వాపోయారు. దాంతో డ్రైవర్లకు కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బొల్లారం సంపత్, నాయకులు గడ్డమీద దేవేందర్, యాకయ్య, సుధాకర్, రవి, సారంగపాణి, పోచయ్య, రాజేందర్, రాజు, యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఏఓకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

'ఆశ'లకు కనీస వేతనం చెల్లించాలి

ఎంజీఎం: ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు కాసు మాధవి డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని ఆశ కార్యకర్తలు ఎంజీఎం వద్ద చేపట్టిన సమ్మె శుక్రవారం 12వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సమ్మెకు సంఘీభావం తెలిపి మాధవి మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని ఆశ వర్కర్లు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. చాలీచాలని వేతనాలతో ఆశ వర్కర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అన్ని రకాల వైద్య సర్వేలకు ఆశ కార్యకర్తల సేవలను ప్రభుత్వం వినియోగించుకుంటూ వారి సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేస్తోందని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని మాధవి కోరారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఆశ కార్యకర్తలు

రేపు జిల్లా వ్యాప్తంగా రాస్తారోకో



కేటీఆర్‌కు వినతిపత్రం ఇస్తున్న రాగుల రమేష్

న్యూశాయంపేట: వరంగల్ నగర పర్యటనలో యూనియన్లపై మంత్రి కేటీఆర్ మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని 12రోజులుగా సమ్మె చేస్తున్న ఆశ కార్యకర్తలు శుక్రవారం మంత్రికి వినతి పత్రం ఇస్తున్న సందర్భంగా ఆయన యూనియన్ల గురించి అసభ్యకరంగా మాట్లాడారని అన్నారు. పనిమాలిన సంఘాలు, పనికిమాలిన వారు అనడం మంత్రికి తగదని రమేష్ హితవు పలికారు. ఈ క్రమంలో కేటీఆర్ మాటలను నిరసిస్తూ హనుమకొండ జిల్లా వ్యాప్తంగా శనివారం ఆశ వర్కర్ల రాస్తారోకో కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు చెప్పారు.

డాక్టరేట్ అందుకున్న అర్చకుడికి సన్మానం

హసన్‌పర్తి: విశ్వ జ్యోతిష్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్ అందుకున్న భీమారానికి చెందిన శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థాన అర్చకుడు ఆరుట్ల శ్రీనాథాచార్యులను వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ శుక్రవారం సన్మానించారు. పౌరోహిత్య రంగాల్లో విశేష కృషి చేసినందుకు శ్రీనాథాచార్యులకు ఇటీవల హనుమకొండలోని జరిగిన కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. కార్పొరేటర్ జక్కుల రజిత, రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎల్లావుల లలితాయాదవ్, మాజీ కార్పొరేటర్ వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రవీందర్, రైతు బంధు సమితి జిల్లా కార్యవర్గ సభ్యుడు బాబు, యూత్ అధ్యక్షుడు సాయి పాల్గొన్నారు.



అర్చకుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేష్